ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 19.0



వేదికపైకి వస్తూ ఓ మహిళతో కరచాలనం చేసేందుకు చేయి ఇస్తున్న సీఎం

రెండేళ్లలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు



ప్రజా పాలన ఏడాది ముగిసిన సందర్భంగా విజయోత్సవాల పోస్టర్లను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి(కుడి నుంచి) ఎమ్మెల్యే జీఎంఆర్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు



సభికులకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

- గ్రీన్ చానల్ ద్వారా ప్రాజెక్టుల నిధులతో పసిడి పంటల పాలమూరు
- ఐదేళ్లలో ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున రూ.లక్ష కోట్ల నిధులు
- ఈ ప్రాంత బిడ్డగా.. ప్రజల కన్నీళ్లు తెలుసు, కష్టపడే తత్వం తెలుసు..
- 70 ఏళ్లకు దక్కిన అవకాశం.. అభివృద్ధి చేయకపోతే చరిత్ర క్షమించదు
- జిల్లాను అభివృద్ధి చేద్దామనుకుంటుంటే.. కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారు
- ఎవరు అడ్డొచ్చినా తొక్కుకుంటూ వెళ్లి అభివృద్ధి చేస్తా
- దత్తత తీసుకునే దయాదాక్షిణ్యాలు మనకొద్దు.. మీ బిడ్డ సీఎంగా ఉన్నాడు
- రైతు పండుగ ముగింపు సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ మహబూబ్‌నగర్, నవంబరు 30 : పాలమూరు బిడ్డగా రెండేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులతోపాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులను పూర్తి చేసి, 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు రోజులుగా జరుగుతున్న రైతు పండుగ ముగింపు సభకు సీఎం శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమైక్య పాలనలో పాలమూరు జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. తాము మక్తల్, నారాయణపేట, కొడంగల్‌కు నీళ్లు ఇస్తామంటే బీఆర్ఎస్ కుట్రలు చేస్తున్నదని చెప్పారు. వలస జిల్లా పచ్చబడి పోయి, పసిడి పంటలు పండాలని కోరారు. గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు ఇచ్చి.. అన్ని ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. అలాగే మిగతా అభివృద్ధి పనులకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున రూ.లక్ష కోట్లు విడుదల చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కేబినెట్ మంత్రులను చప్పట్లతో నిధుల కోసం కోరాలని ప్రజలకు

(మిగతా 6లో..)



ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



మహబూబ్‌నగర్ సమీపంలోని అమిస్తాపూర్ వద్ద నిర్వహించిన రైతు పండుగ సభకు అశేషంగా హాజరైన ప్రజలు

మూడంచెల భద్రతలో వ్యవసాయ స్టాల్స్

పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు గడిస్తున్న లావణ్య స్టాల్ సందర్శన

6

అభివృద్ధి పనులకు రూ.143.53 కోట్లు

శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

పాలమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో బీటీ రోడ్లకు రూ.49.90 కోట్లు

6

సీఎం సభ సైడ్‌లైట్స్

- సీఎం రాకకు గంట ముందుగానే మైదానం నిండిపోయింది
- సభకు రెండు వైపులా కిలోమీటర్ దూరంలో ఏర్పాటు చేసి పార్కింగ్ కేంద్రాల నుంచి రైతులు నడుచుకుంటూ రావడం జాతరను తలపించింది
- షెడ్యూల్ కన్నా సీఎం పర్యటన 45 నిమిషాలు ఆలస్యంగా సాగింది
- సాయంత్రం 4:17 గంటలకు సీఎం హెలికాప్టర్ గాల్లో కనిపించడంతో రైతులు కేరింతలతో స్వాగతించారు
- 4:28 గంటలకు సీఎం హెలిప్యాడ్ దిగి బస్సులో ఎగ్జిబిషన్‌కు చేరుకుని స్టాళ్లను పరిశీలించారు.
- స్టాళ్ల దగ్గర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ట్రాక్టర్ నడిపి అందరినీ ఉత్సాహపరిచారు.
- సభ ముందు ఏర్పాటు చేసిన 50 మీటర్ల ర్యాంప్‌పై సీఎం నడుచుకుంటూ వెళ్లి రైతులకు, కార్యకర్తలకు అభివాదం చేశారు. ఓ అభిమాని సీఎంకు ఫొటో బహూకరించారు.
- మంత్రి కొండా సురేఖ మినహా మిగతా కేబినెట్ మొత్తం రైతు సభకు హాజరయ్యారు.
- సీఎం ప్రసంగంలో కేసీఆర్‌ను విమర్శించినప్పుడు, పాలమూరుకు నిధుల గురించి ప్రస్తావించినప్పుడు జనం నుంచి పెద్దఎత్తున స్పందన లభించింది.
- పాలమూరు అభివృద్ధికి వేదికపై ఉన్న మంత్రులు సహకరించాలని, వారికి అందరూ గట్టిగా చప్పట్లతో కృతజ్ఞతలు చెప్పాలని సీఎం రైతులతో చప్పట్లు కొట్టించారు.
- సీఎం ప్రసంగిస్తూ పనిమంతుడు పందిరి వేస్తే కుక్కతోక తగిలి కూలిపోయినట్లు రూ.లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం అలానే కూలిపోయిందని అన్నపుడు సభలో నవ్వులు విరిశాయి.




నృత్యం చేస్తున్న మహిళ



వేదికపై(ఎడమ నుంచి) మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి



సీఎంకు పిల్లలమర్రి ఫొటోను జ్ఞాపికగా అందిస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి తదితరులు



స్టాల్‌లో పశువులను చూస్తున్న సీఎం, మంత్రి జూపల్లి



సభలో కాంగ్రెస్ జెండాతో చిన్నారి

జన జాతర

- కురుమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు



జాతర మైదానంలో భక్తుల కిటకిట



కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

7

తరలొస్తున్న ధాన్యం

- నారాయణపేట యార్డుకు గతంకంటే అధికంగా వస్తున్న సన్న వడ్లు
- ఇప్పటి వరకు 70,347 క్వింటాళ్ల కొనుగోలు
- గరిష్ఠంగా రూ.2,820.. కనిష్ఠంగా రూ.1,439 ధర
- బోనస్ ఇస్తున్నా ప్రైవేటుకు అమ్మేందుకే రైతుల మొగ్గు



నారాయణపేట మార్కెట్ యార్డులో ధాన్యం తూకం చేస్తున్న హమాలీలు

నారాయణపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధ్యాన్యం అధికంగా వస్తోంది. ఈ వానాకాలం సీజన్ ఆరంభం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు యార్డుకు సోన రకం ధాన్యం 70,347 క్వింటాళ్ల విక్రయానికి వచ్చింది. క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,820 ధర పలుకగా, కనిష్ఠంగా రూ.1,439 ధర పలికింది. హంస రకం 4,494 క్వింటాళ్ల రాగా, గరిష్ఠంగా రూ.3,543, కనిష్ఠంగా రూ.1,565 ధర వచ్చింది. ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి క్వింటాలుపై రూ.500 బోనస్ ప్రకటించింది. అంటే మద్దతు ధర రూ.2,320తో పాటు రూ.500 బోనస్ కలుపుకుంటే క్వింటాలుకు రూ.2,820 వస్తోంది. అదే ప్రైవేటుగా అయితే క్వింటాలుకు గరిష్ఠంగా రూ.2,820 ఇస్తున్నారు. ప్రభుత్వం బోనస్ కలుపుకున్నా ప్రైవేటుగా ఇచ్చే ధరకే సమానంగా ఉండటంతో ప్రైవేటు వ్యాపారులకు అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు. దానితోడు బోనస్ రావాలంటే నిబంధనలు అధికంగా ఉండటం, ధాన్యం ఆరబెట్టి రావాల్సి ఉండటంతో చాలా మంది రైతులు పచ్చి వడ్లను క్వింటాలుకు రూ.2,080కి అమ్ముతున్నారు.



మార్కెట్‌కు ట్రాక్టర్‌లో తెచ్చిన పచ్చి వడ్లు

గతంకంటే తగ్గిన హంసల దిగుబడి

గత ఏడాది వానాకాలం నవంబరు 26 వరకు యార్డుకు సోన ధాన్యం 69,738 క్వింటాళ్ల విక్రయానికి రాగా, అప్పట్లో క్వింటాలుకు గరిష్ఠంగా రూ.3,056, కనిష్ఠంగా రూ.1,601 ధర పలికింది. హంసలు 13,263 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా ధర రూ.2,019, కనిష్ఠంగా రూ.1,601 ధరలు పలికాయి. హంస ధాన్యం ఈ సారి సాగు తగ్గడంతో దిగుబడి కూడా తగ్గింది.

23 వేల మెట్రిక్ టన్నులు కొన్నాం



జిల్లా వ్యాప్తంగా 102 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 31,749 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. రైతులకు రూ.57.410 కోట్లు చెల్లించాం. సన్నరకం 23 వేల మెట్రిక్‌టన్నులు కొన్నాం. రూ.500 బోనస్‌గా 3,208 మంది రైతులకు రూ.4.68 కోట్లు చెల్లించాం. 17 శాతంలోపు తేమ, నిబంధనల ప్రకారం గింజ ఉంటే బోనస్ ఇస్తున్నాం.

- దేవదాస్, సివిల్ సప్లయ్ డీఎం, నారాయణపేట

మరణాన్ని జయించిన మహిళ

వలస వెళ్లి ఆపదలో చిక్కుకొని..

7



ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దాం

ఐసీటీసీ కేంద్రంలో ఉచితంగా మందులు

సమీకృతం.. సమస్యలతో సతమతం



మునిసిపాలిటీలో రూ.3 కోట్ల వాణిజ్య సముదాయాలపై అనాసక్తి

మూడు నెలలుగా ముందుకు సాగని వేలంపాట టెండర్లు

7

క్రీడల్లో రాణించాలి

- అర్బన్ మండల ఎంఈవో లక్ష్మణ్‌నాయక్
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్



పోటీలకు హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మహబూబ్‌నగర్ అర్బన్ మండల ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాల, బాలికల రగ్బీ టోర్నీని శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభ చాటి, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి మాట్లాడుతూ డిసెంబరులో బిహార్ రాష్ట్రం పాట్నాలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి 240 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, వ్యాయమ ఉపాధ్యాయులు వేణుగోపాల్, రమేస్‌బాబు, వడెన్న, బాల్‌రాజ్, పరశురాం, సాదత్‌ఖాన్, నాగరాజు పాల్గొన్నారు.



వాహనాల పార్కింగ్ స్థలం నుంచి సీఎం సభకు తరలొస్తున్న జనం



బహిరంగ సభ వద్దకు వస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



రైతు పండుగ సభలో పాటలు పాడుతున్న కళాకారులు

రెండేళ్లలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ఈ ప్రాంత బిడ్డగా చిన్నప్పటి నుంచి ప్రజల కన్నీళ్లు, వలస కష్టాలు, కష్టపడే తత్వం తెలుసన్నారు. తమకూ ఓ రోజు వస్తుందని ఎదురుచూస్తే.. 70 ఏళ్ల తర్వాత పాలమూరు బిడ్డ సీఎం అయ్యారని, ఇప్పుడు అభివృద్ధి చేయకపోతే చరిత్ర తనను క్షమించదని అన్నారు. పాలమూరును అభివృద్ధి చేద్దామనుకుంటే కాళ్లల్లో కట్టె పెడుతున్నారని, ఎవరు అడ్డొచ్చినా, ఆటంకాలు సృష్టించినా.. తొక్కుకుంటూ వెళ్తానని అన్నారు. నల్లమలలో పులులను, మృగాలను చూశానని, ఈ మానవ మృగాలతో భయం లేదని అన్నారు. అలా భయపడుంటే ఇక్కడ వరకు వచ్చేవాడిని కాదని తెలిపారు. ఎవరొచ్చినా పాలమూరును దత్తత తీసుకుంటానని అంటారని, కానీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరం లేదని, పాలమూరు బిడ్డనే సీఎంగా ఉన్నారని అన్నారు. మహబూబ్‌నగర్‌కు నిజంగా పండగ వచ్చిందని తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలంటే భూసేకరణ అవసరమన్నారు. తల్లిలాంటి భూమిని వదులుకోవడానికి ఏ రైతుకు ఇష్టం ఉండదని, కానీ అభివృద్ధి కోసం తప్పదన్నారు. గత ప్రభుత్వాలు భూసేకరణ చేసినప్పుడు ఇలాగే పాలమూరు రైతులు అడ్డుకుని ఉంటే.. ఏ ప్రాజెక్టు పూర్తి కాకపోయేదని అన్నారు. కానీ అభివృద్ధి కోసం చూస్తూ ఊరుకున్నామని చెప్పారు. కొడంగల్‌ను అభివృద్ధి చెద్దామంటే అమాయకులను అడ్డంపెట్టుకుని కుట్రలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయని, కానీ రైతులపైనే కేసులు అవుతాయని అన్నారు. ఈ ప్రాంత బిడ్డగా ఎకరాకు రూ.10 లక్షలు ఎక్కువ కావాలంటే ఇస్తానని, బీఆర్ఎస్ ఉచ్చులో పడొద్దని కోరారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు: ఉపముఖ్యమంత్రి భట్టి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 66 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందన్నారు కాళేశ్వరం కుంగిపోయినా.. దాని అవసరం లేకుండానే ఎస్ఆర్ఎస్‌పీ, ఎల్ఎండీ, మిడ్‌మానేర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని చెప్పారు. కానీ బీఆర్ఎస్ నాయకులు దారి వెంట వెళ్తూ ధాన్యం కొనుగోలు చేయడం లేదని గగ్గోలు పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు చేసి.. డబ్బులు వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో బోనస్‌తోపాటు వేస్తున్నామని అన్నారు.

రేవంత్ సర్కార్‌ను రైతులే కాపాడుకోవాలి: మల్లురవి

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ రోజూ ఇలాంటి రైతు సదస్సులు



నిర్వహించలేదని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. పాలమూరు బిడ్డగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, ఆయన్ను రైతులు కాపాడుకుంటే ఆయన మిమ్మల్ని కాపాడతారన్నారు. ధాన్యం కొనుగోలు చేసి వెంటనే డబ్బులు ఖాతాలో జమచేయడంతోపాటు సన్నాలకు బోనస్ ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌కు దక్కిందన్నారు.

రాక్షసపాలనకు అంతానికి ఏడాది: జీఎంఆర్



ప్రజలు రాబంధుల రాక్షస పాలనను అంతమొందించి, ప్రజా పాలనకు ఆహ్వానం పలికి ఏడాదవుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఏడాదిలో కాంగ్రెస్ రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చినందుకు రైతు పండగ జరుపుకుంటున్నామని, రైతులు ప్రభుత్వంపై విశ్వాసంతో స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. అనుకున్నదానికన్నా పెద్దఎత్తున రైతులు తరలిరావడం సంతోషంగా ఉందని చెప్పారు.

బీఆర్ఎస్ కంట్లో నిప్పులు: యెన్నం



రైతులు పండగ చేసుకుంటుంటే బీఆర్ఎస్ కంట్లో నిప్పులు పోసుకుంటుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి సీఎం కావడానికి కృషి చేసిన పాలమూరుకు మొండి చేయి చూయించారని విమర్శించారు. అందుకే పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రిగా అయి పాలమూరును అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. బీఆర్ఎస్ రైతులను ఓటుబ్యాంకు గానే వాడుకుందని, రైతులను రుణ విముక్తులను చేసిన ఘనత రేవంత్‌దని పేర్కొన్నారు. ఇది ట్రైలర్ మాత్రమేనని మునుముందు రైతుల కోసం నిర్ణయాలు దేశం గర్వపడేలా ఉంటాయన్నారు.

అప్పుడు మన్మోహన్ ఇప్పుడు రేవంత్: అనిరుధ్‌రెడ్డి



నాడు మన్మోహన్‌సింగ్ ప్రధానిగా రైతులకు రుణమాఫీ చేస్తే నేడు రేవంత్ రైతులకు రుణమాఫీ చేశారని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి కొనియాడారు. బీఆర్ఎస్ ఎప్పుడూ రైతువ్యతిరేక ప్రభుత్వమేనని పేర్కొన్నారు. బీజేపీ.. పారిశ్రామిక వేత్తలైన ఆదాని, అంబానిలకు వేల కోట్లు మాఫీ చేస్తుంది కానీ రైతులను మాత్రం పట్టించుకోదని విమర్శించారు.

రైతుల కోసం పెద్దఎత్తున కార్యక్రమాలు : మేఘారెడ్డి



వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం రేవంత్ సర్కార్ పెద్ద ఎత్తున కార్యక్రమాలు అమలు చేస్తుంటే బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మరోసారి పిచ్చిమాటలు మాట్లాడకుండా రైతులే బుద్ధి చెప్పాలన్నారు.

ఎంతో నేర్చుకున్నారు: శ్రీహరి



సదస్సులో స్టాళ్ల వద్ద వ్యవసాయ విధానాలు, ఆధునిక పద్ధతుల గురించి రైతులు ఎంతో నేర్చుకున్నారన్నారని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

నేడు రేవంత్‌రెడ్డి: వంశీకృష్ణ



ఒకప్పుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతు సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలుచేస్తే ఇప్పుడు రేవంత్‌రెడ్డి అంతకు మించి కృషి చేస్తున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ అన్నారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రాంమ్మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ పదేళ్ళు రాష్ట్రంలో విధ్వంస పాలన సాగించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారిస్తే.. ముఖ్యమంత్రి రేవంత్ రాష్ట్రాన్ని గాడిన పెట్టారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతకుమారి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, నాయకులు ఏపీ జితేందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, ఒబేదుల్లా కొత్వాల్, శివసేనారెడ్డి, మిథున్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్, వినోద్‌కుమార్, ఎస్‌పీ వెంకటేశ్, సంజీవ్ ముదిరాజ్, సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు.



డీసీఎం వాహనంపైకి ఎక్కి, సీఎం ప్రసంగం వింటున్న యువకులు



సభా స్థలం నిండిపోవడంతో నిల్చొని సీఎం ప్రసంగం వింటున్న మహిళలు



బందోబస్తును పర్యవేక్షిస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి



అచ్చంపేటలో మంత్రి సీతక్కను సన్మానించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

మంత్రి సీతక్కకు ఘన స్వాగతం

అచ్చంపేట టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం లో మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్తున్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు అచ్చంపేటలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నివాసం వద్ద సీతక్కను కాంగ్రెస్ నాయకులు శాలువాలు కప్పి సన్మానించారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో అంజనీమాత సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష దీపోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో కలిసి ఆమె పాల్గొని దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, ఉమామహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సభలో దొంగలు

- పట్టుకున్న పోలీసులు

మహబూబ్‌నగర్, నవంబరు 30 : సీఎం సభలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. సభను ఆసక్తిగా వింటున్న కార్యకర్తల నుంచి దొంగలు జేబులు కొట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలోనే ఇద్దరు యువకులు పాలకొండకు చెందిన కాంగ్రెస్ నాయకుడి మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైన్‌ను లాగారు. వెంటనే తేరుకున్న ఆ వ్యక్తి తెగిన చైన్ గట్టిగా పట్టుకున్నాడు. పక్కనున్న వాళ్లు ఇద్దరు వ్యక్తులను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనే లక్ష్యం

-జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి

కందనూలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కేవీ స్వరాజ్యలక్ష్మి సిబ్బందికి సూచించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా నాగర్‌కర్నూల్ పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. డిసెంబరు 2వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధి గ్రస్తులను గుర్తించే సర్వే చేయాలని తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే 900 బృందాలను సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య అధికారి డాక్టర్ ఎం.వెంకటదాస్, డాక్టర్ తారాసింగ్, డాక్టర్ భీమానాయక్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

మూడంచెల భద్రతలో.. వ్యవసాయ స్టాల్స్

- పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు

భూత్పూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు జిల్లాలో నిర్వహించిన రైతు పండుగ విజయవంతంగా ముగిసింది. శనివారం ముగింపు కార్యక్రమంలో భాగంగా దేవరకద్ర నియోజవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన అమిస్తాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దామోదర రాజనర్సింహ్మ, భట్టి విక్రమార్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కార్పొరేషన్ చైర్మన్లు, హాజరయ్యారు. సాయంత్రం 4:20 గంటలకు ముఖ్యంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలీప్యాడ్‌లో సభా ప్రాంగాణానికి చేరుకున్నారు. మంత్రులతో కలిసి వ్యవసాయ స్టాళ్లను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో లాభసాటి పంటలను పండిస్తున్న లావణ్య స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ స్టాల్స్, రైతులు సాగుచేసే వివిధ పంటలు, ప్రకృతి వ్యవసాయం గురించి ముఖ్యంత్రికి వివరించారు. పుంగనూరు గోవుల పెంపకందారులతో, ఆయిల్‌పాం సాగు చేసిన రైతులతో ముఖ్యంత్రి మాట్లాడారు. అక్కడి నుంచి 4:51 గంటలకు సభా వేదికపైకి చేరుకున్నారు. అనతరం 5:03 నిమిషాలకు రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ పాడారు. 5:55 నిమిషాలకు సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అంతకు ముందు రైతు రుణమాఫీ కింద రూ.2,747.67 కోట్ల చెక్కును రైతులకు అందించారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కు అందించారు. సభకు దాదాపుగా 1లక్ష 50 వేల మంది హాజరయ్యారు. సభకు వచ్చిన వారు తిరుగు ప్రయాణంలో 44వ జాతీయ రహదారి భూత్పూర్ నుంచి పోతుల మడుగు వరకు వాహనాలు నిలిచిపోయాయి.



స్టాల్‌లో ప్రదర్శనకు తెచ్చిన ఆయిల్‌పామ్ గెలలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు



స్టాల్స్‌లో మందులు పిచికారి చేసే డ్రోన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌ను నడిపిన సీఎం రేవంత్‌రెడ్డి

పాలమూరు, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మార్కెట్‌లోకి తొందరలో విడుదలయ్యే మోంటా ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌ను శనివారం రైతు పండుగలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నడిపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ వాహనాల అవసరం చాలా ఉందని అన్నారు. ఈ వాహనాల తయారీ రంగంలో అనేక మార్పులు వచ్చాయని, రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

వాహనాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణా రావు, కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. మురుగప్ప గ్రూప్ వారు తయారు చేసే ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు త్వరలో రైతులకు అందుబాటులో ఉంటాయని వాహన తయారీ నేషనల్ హెడ్ విజయ్ అశోక్ దోకి తెలిపారు.



44వ జాతీయ రహదారిపై భూత్పూర్ వద్ద నిలిచిన వాహనాలు



సభా వేదికపై మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందిస్తున్న సీఎం, మంత్రులు

మూడు కిలోమీటర్ల దూరంలో పార్కింగ్

● ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన పోలీసులు

మహబుబ్‌నగర్ రూరల్, నవంబరు 30 (ఆధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపాలన ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా పాలమూరు జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రైతు పండగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి రైతులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సభకు వచ్చిన వారికి ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా పోలీసులు సభ ప్రాంగణానికి దాదాపు మూడు కిలో మీటర్ల దూరంలో రెండు చోట్ల పార్కింగ్ ఏర్పాటు చేశారు. అందులో మహబూబ్‌నగర్ భూత్పూరు వెళ్లే దారిలో సాక్షిగణపతి దేవాలయం సమీపన దాదాపు 40 ఎకరాలను చదును చేసి ఒకటవ పార్కింగ్ ఏర్పాటు చేశారు. భూత్పూరు నుంచి జడ్చర్ల వెళ్లే దారిలో దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో చదును చేసి రెండో పార్కింగ్ ఏర్పాటు చేశారు. సభకు వచ్చే రైతుల కోసం భూత్పూరు వద్ద తాగునీటీ సౌకర్యం కల్పించారు. సభకు వచ్చిన రైతులకు తమకు కేటాయించి బస్సులు, ఇతర వహనాలలోనే అల్పాహారం, భోజన సౌకర్యం కల్పించినట్లు రైతులు తెలిపారు. సభ పూర్తి అయ్యాక ఎవరి వాహనం ఎక్కడ ఉన్నది, తమ గ్రామానికి కేటాయించిన బస్సు కోసం రైతులు కొంత ఇబ్బంది పడ్డారు.



రైతు పండుగ సభకు వచ్చిన బస్సులు

అభివృద్ధి పనులకు రూ.143.53 కోట్లు

- శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

పాలమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు రోజుల కొనసాగిన రైతు పండుగలో భాగంగా చివరిరోజు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో రూ.143.53 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

● పాలమూరు పట్టణంలో టీజీ ఈడబ్ల్యూఐడీసీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉర్దూఘర్, షాదీఖానా, ముస్లిం గ్రేవ్‌యార్డు, మౌలాలిగుట్ట ప్రహరీ నిర్మాణానికి రూ.45కోట్లు కేటాయించారు.

● పాలమూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 25 బీటీ రోడ్ల పనుల(సీఆర్ఆర్ నిధులు)కు రూ.49.90 కోట్లు. జడ్చర్ల నియోజకవర్గంలోని బాలానగర్ మండలంలో ఆర్అండ్‌బీ విభాగంలో పలుగుతండా -తిర్మలగిరి వయా జోగ్యానాయక్ తండా 3.5 కిలో మీటర్లు, తిర్మలగిరి-రామస్వామిగుట్ట తండా వయా హాతిరాం తండా మూడు కిలోమీటర్లు, బాలానగర్-గంగాపూర్ ఆర్అండ్‌బీ రోడ్డు-చిన్నరేవల్లి(పైకి పెద్ద చెల్క తండా)-1.5 కిలో మీటర్లు, రాజాపూర్ మండలంలోని దొండపల్లి-ఇప్పటూరు వయా 1.5కిలో మీటర్లు పనులకు రూ.10.68 కోట్లు కేటాయించారు.

● ఆర్అండ్‌బీ విభాగంలో సింగిల్ లైన్-డబుల్ లైన్ పనులు మిడ్జిల్-కొత్తపల్లి రోడ్డు వయా కొత్తూరు, వెలుగోముల, అయ్యవారిపల్లి, రెడ్యాగూడ-12 కిలో మీటర్ల పనులకు రూ.25 కోట్లు కేటాయించారు.

● దేవరకద్ర నియోజకవర్గం భూత్పూర్ మండలం పోతులమడుగులో మిని స్టేడియం నిర్మాణం కోసం రూ.2.65 కోట్లు కేటాయించారు.

● జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని కేజీబీవీ జూనియర్ కళాశాలలో తరగతి గదులు, ల్యాబోరేటరీ, టాయిలెట్ బ్లాకులుగా పెంచేందుకు రూ.3.25 కోట్లు, అలంపూర్ కేజీబీవీకి రూ.2.30 కోట్లు, నందిన్నెలోని కేజీబీవీ బిల్డింగ్ నిర్మాణం కోసం రూ.2.70 కోట్లు, గట్టు కేజీబీవీ నూతన భవనం పెంపుకోసం రూ.2.05 కోట్లు కేటాయించారు.

సీఎం సభకు వెయ్యి బస్సులు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామ శివారులో నిర్వహిస్తున్న రైతు పండుగ సభకు రైతులు వెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి బస్సులను ఏర్పాటు చేసినట్లు డీఎం. సుజాత తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఈ సభను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, వివిధ సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అవగాహన కల్పించారు. ఈ సభకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు వచ్చేందుకు వెయ్యి బస్సులు ఏర్పాటు చేయడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మరణాన్ని జయించిన మహిళ

- వలస వెళ్లి ఆపదలో చిక్కుకొని..
- ఎయిడ్స్ మహమ్మారిని తరిమేద్దాం
- ఐసీటీసీ కేంద్రంలో ఉచిత మందులు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం



నారాయణపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన 45 ఏళ్ల వితంతు మహిళ మరణాన్ని జయించింది. పదిహేనేళ్ల క్రితం తన భర్త చనిపోగా కుమారుడితో పొట్ట కూటి కోసం ముంబయికి వలస వెళ్లి పన్నెండు ఏళ్ల పాటు అక్కడే పనులు చేస్తుండేది. కుమారుడి వయస్సు అప్పట్లో 14 సంవత్సరాలు. ఆమె తరచూ అనారోగ్యం బారిన పడటంతో ముంబయి నుంచి తిరిగి స్వగ్రామానికి వచ్చింది. 2020లో నారాయణపేట జిల్లా ఆసుపత్రిని చికిత్స నిమిత్తం ఆశ్రయించింది.

అప్పటికే 30 కిలోల తక్కువ బరువుతో మెడ, భుజం దగ్గర వాపులతో నీరసంగా ఉన్న ఆమెను డాక్టర్ పరీక్షించి హెచ్‌ఐవీ పరీక్ష కౌన్సెలింగ్ సెంటర్‌కు పంపారు. ఆమె ఒంటరి మహిళ కావడంతో అనేక సార్లు అజాగ్రత్తతో శారీరక సంబంధాలలో హెచ్‌ఐవి పాజిటివ్ బారిన పడినట్లు గుర్తించారు. కౌన్సెలింగ్‌లో ఆమెకు అన్నివిధాలా భరోసా కల్పించి మందులు ప్రారంభించి తినే ఆహారపు అలవాట్లతో పాటు జీవన విధానం వివరించి సక్రమంగా పాటించేలా సహాయం చేశారు. కన్నతల్లికి కొడుకు అండగా నిలిచేలా కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఆమె మరణాన్ని జయించి ప్రస్తుతం ఆరోగ్యంగా ఉంటోంది. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

జిల్లాలో 70 హెచ్‌ఐవీ కేసుల నమోదు

2024 జనవరి నుంచి నవంబర్ వరకు నారాయణపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని ఐసీటీసీ కేంద్రం (హెచ్‌ఐవీ సమగ్ర సలహా, పరీక్ష కేంద్రం)లో 8194 మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించగా 70 మందిలో పురుషులు 38 మంది, 32 మంది మహిళలకు పాజిటివ్ అని తేలింది. గర్భిణులకు 7585 మందికి పరీక్షలు నిర్వహించగా ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. రీ ప్రెగ్నెసిలో 12 మంది గర్భిణులు ప్రసవాలు జరగగా ఆ 12 మంది పిల్లలకు పాజిటివ్ సోకకుండా మందులు వాడటంతో సత్ఫలితాలను ఇచ్చిందని జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ సాయిరామ్, ఐసీటీసీ కౌన్సిలర్ సుధాకర్‌లు పేర్కొన్నారు.

ఆ సంబంధాల నుంచి దూరంగా ఉండాలి



వివాహం కాక ముందు, వివాహమైన తర్వాత బయటి వ్యక్తులతో శారీరక, లైంగిక సంబంధాల నుంచి దూరంగా ఉండాలి. వలస పోయేవారు ఇంకా ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. స్వలింగ సంపర్కాలకు దూరంగా ఉండాలి. లైంగిక సంబంధాల విషయంలో నిరోధ్ తప్పక వాడాలి. ప్రతీ వ్యక్తికి హెచ్‌ఐవీ కౌన్సెలింగ్ పరీక్షలు చేయించేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. జిల్లా ఆసుపత్రిలో సుఖ వ్యాధులకు సంబంధించి సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆశ, అంగన్‌వాడీ, ఏఎన్‌ఎంలు విధిగా హెచ్‌ఐవీ గురించి ప్రజలకు గ్రామాల్లో తెలియపర్చాలి. పరీక్షలకు ప్రోత్సహించాలి. ఐసీటీసీ కేంద్రంలో కౌన్సెలింగ్ పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ చేస్తున్నాం.

- ఎం.సుధాకర్‌బాబు, ఐసీటీసీ కౌన్సెలర్

సమీకృతం..

○ సమస్యలతో సతమతం

- మునిసిపాలిటీలో రూ.3 కోట్ల వాణిజ్య సముదాయాలపై అనాసక్తి
- 86 షాపుల టెండర్‌లకు 10 మందే వేలం పాటకోసం డీడీల చెల్లింపు
- ముందుచూపు లేని నిర్మాణాలపై ఆసక్తి చూపని చిరు వ్యాపారులు
- టెండర్ డిపాజిట్‌ను రూ. 50 వేల నుంచి రూ. 25 వేలకు తగ్గించినా అంతే !
- మూడు నెలలుగా ముందుకు సాగని సమీకృత మార్కెట్ వేలంపాట టెండర్లు

కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం

టెండర్లు ఆహ్వానించినా వేలం పాటలో పాల్గొనేందుకు చిరువ్యాపారులు ఆసక్తి చూపటం లేదు. రూ.50 వేల నుంచి రూ. 25 వేలకు తగ్గించినా కేవలం 10 మంది మాత్రమే డీడీలు చెల్లించారు. ఇందులో మొత్తం 86 దుకాణాలు ఉన్నాయి. అన్ని వివరాలను కలెక్టర్‌కు నివేదించాం. తదుపరి చర్యలు కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకుంటాం.

- అశోక్‌రెడ్డి, మేనేజర్. మునిసిపాలిటీ అయిజ



అయిజలో నూతనంగా నిర్మించిన సమీకృత మార్కెట్

అయిజటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వ్యాపార పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న అయిజ పట్టణంలో సమీకృత మార్కెట్ సముదాయ నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.మూడు కోట్లతో మూడేళ్ల క్రితం నిర్మించి వాణిజ్య సముదాయాలను ఏడాది క్రితం అసెంబ్లీ ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేశారు. అప్పట్లో వాణిజ్య సముదాయాల ప్రారంభ వేడుకలపై ఉన్న శ్రద్ధ మార్కెట్‌ను ప్రజల ముందుకు తెచ్చే విషయంలో మునిసిపాలిటీ పాలకవర్గం శ్రద్ధ చూపటం లేదనే విమర్శలు వినపడుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల తరువాత ఎవరు అధికారంలో ఉంటారో అనే సందేహాలతో అప్పట్లో అధికారంలో ఉన్న నాయకుల చేత ఆఘమేఘాల మీద ప్రారంభం చేపించి ఏడాది గడుస్తున్నా చిరు వ్యాపారులకు కేటాయించక పోవటంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నిర్మాణాలు ఇలా...

అయిజ పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో ప్రభుత్వం వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌తో పాటు ఫ్లవర్ మార్కెట్‌ను కూడా నిర్మించింది. అందులో 38 నిర్మాణాలు ఆర్‌సీసీతో ఉన్న షట్టర్‌లు కాగా, మరో 48 రేకులతో నిర్మించిన షెడ్లు ఉన్నాయి. ఈ నిర్మాణాలన్నీ కూడా ప్రారంభానికి రెండేళ్ల క్రితమే పూర్తైనప్పటికీ అధికారులు, సంబంధిత పాలకవర్గం మాత్రం టెండర్లు పిలువకుండా ఆలస్యం చేశారు. ఆ ప్రాంతంలోనే పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందనే కారణంతో కూడా టెండర్లను వాయిదాలు వేస్తూ వచ్చారు.

రెండు నెలల క్రితం టెండర్లకు ఆహ్వానం

కలెక్టర్ ఆదేశాల మేరకు అక్టోబరు నెలలో 86 సమీకృత వాణిజ్య సముదాయలకు మునిసిపాలిటీ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. వేలం పాటలో పాల్గొనే చిరువ్యాపారులు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలనే నింబంధన పొందుపరిచారు. అంతే కాకుండా వ్యాపార సముదాయాల టెండర్‌లో రిజర్వేషన్ విధానాన్ని కూడా అమలు చేశారు. అక్టోబరు 30న, టెండర్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికి వేలం పాట నిర్వహించనున్నట్లు మునిసిపల్ అధికారులు ప్రకటించారు. చివరి తేదీనాటికి పట్టుమని పదిమంది కూడా టెండర్లలో పాల్గొనేందుకు డీడీలు చెల్లించలేదు.

అనాసక్తికి కారణం లేకపోలేదు..

మూడు కోట్లు ఖర్చుచేసి నిర్మించిన వాణిజ్య సముదాయాలపై చిరువ్యాపారులు ఆసక్తి కనబరచక పోవటానికీ కారణం లేకపోలేదు. పెద్దవాగు బ్రిడ్జి నిర్మాణం వల్ల మార్కెట్ సముదాయం ముందువెళ్లే రోడ్డుమార్గం ఎత్తు కావటం, మార్కెట్ దాదాపు ఐదు ఫీట్ల దిగువన ఉండటంతో ప్రధానంగా దారికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. రెండు గేట్లు ఉండగా ఒక గేటు మొత్తం మూతబడే అవకాశం ఉంది. ఉన్న ఒక్క గేటులో పెద్ద వాహనాలు లోపలికి వెళ్లి బయటికి వచ్చేందుకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. దానికి తోడు చిరువ్యాపారుల వద్ద దొరికే కూరగాయలు, చేపలు, మాంసం, వివిధ రకాల పూలు కొనుగోలు చేసేందుకు వెళ్లే ప్రజలకు కూడా ద్విచక్ర వాహనాలతో వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఇవన్నీ సమస్యలు ఒక ఎత్తైతే రెక్కాడితే కానీ డొక్కాడని రోడ్లపైన వ్యాపారాలు చేసుకునే వారు రూ.50వేలు కానీ, రూ.25వేలు కానీ చెల్లించి వేలంలో పాల్గొనే స్థోమత లేక పోవటం మరో కారణంగా కనిపిస్తుంది. వేలం పాటలో పాల్గొనే వారికి రిజర్వేషన్ నిబంధన కూడా అడ్డంకిగా మారినట్లు తెలుస్తుంది.

టెండర్ రుసుం రూ.25 వేలకు తగ్గించినా...

కలెక్టర్ ఆదేశాల మేరకు మరికొన్ని రోజులు గడువిచ్చి టెండర్ల ధరను రూ.50 వేల నుంచి రూ. 25 వేలకు తగ్గించారు. అయినప్పటికీ చిరువ్యాపారులు వేలం పాటలో పాల్గొని షాపులను దక్కించుకునేందుకు ఆసక్తిని కనబరచలేదు. మునిసిపాలిటీ అధికారులు పట్టణంలో ఎంత ప్రచారం చేసినా చిరు వ్యాపారుల నుంచి పెద్దగా స్పందన కన్పించటం లేదు.



మార్కెట్ లోపలి స్ట్రీట్ వెండింగ్ నిర్మాణాలు

క్రైం కార్నర్

వీధి కుక్కల దాడిలో 50 గొర్రె పిల్లల మృతి

- రూ. నాలుగు లక్షల ఆస్తి నష్టం



మృతి చెందిన గొర్రె పిల్లలు

పెద్దకొత్తపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గొర్రె పిల్లల మందపై వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి హతమార్చిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గంట్రావుపల్లి గ్రామంలో బొల్లం నాగశేషుకి చెందిన గొర్రెల మంద గ్రామ శివారులో మూలవాగు వద్ద ఏర్పాటు చేశారు. గొర్రెలన్ని మేత కోసం కాపరులు తీసుకెళ్లారు. అయితే చిన్న గొర్రె పిల్లలను అదే మందలో ఓ పక్కన ఇనుప జాలీలో ఉంచారు. 58 గొర్రె పిల్లలపై వీధి కుక్కలు శనివారం మూకుమ్మడిగా దాడి చేసి 50 పిల్లలను హతమార్చాయి. ఇందులో ఎనిమిది గొర్రె పిల్లలు గాయపడ్డాయి. ఈ సంఘటనలో రూ. నాలుగు లక్షల ఆస్తినష్టం జరిగినట్లు గొర్రెల యజమాని తెలిపారు. తమ కుటుంబం గొర్రెల పెంపకం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తుండగా ఇంతలో దుర్ఘటన జరగడం తాము ఆర్థికంగా కోలుకోని దెబ్బ అని బాధితుడు వాపోయాడు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ: ఇద్దరికి తీవ్ర గాయాలు

బిజినేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ఉన్న వడ్డె శివప్రసాద్, చీర్డం మహేష్ యాదవ్ అనే యువకులు తీవ్ర గాయాల పాలయ్యారు. శనివారం గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి మండలంలోని పాలెం వైపు నుంచి బైక్‌పై యువకులు వస్తుండగా బిజినేపల్లి వైపు నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తున్న బస్సు ప్రమాదవశాతు ఢీకొట్టుకున్నాయి. బైక్‌పై ఉన్న యువకులు తీవ్ర గాయాలపాలై రోడ్డుపై పడ్డారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు బంధువులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా: ఒకరి మృతి



అంజనేయులు(ఫైల్)

హన్వాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవ శాత్తు అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొండ్యాల గ్రామానికి చెందిన భూనేటి ఆంజనేయులు (48) మాదారం సమీపం లోని రైస్ మిల్లులో బియ్యం వేసుకున్నారు. ట్రాక్టర్‌లో బియ్యం తీసుకొని గ్రామానికి వెళుతుండగా అమ్మాపూర్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ పైన ఉన్న అంజనేయులుపై ట్రాలీ పడటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ఈ సంఘటనపై మాకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆవుల అక్రమ రవాణా

- కేసు నమోదు: గోశాలకు తరలింపు

మానవపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆవులను అక్రమం గా పెబ్బేరు సంత నుంచి ఏపీ మీదు గా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విశ్వహిందూ పరిషత్ సభ్యులు రాజశేఖర్ శర్మ, రఘువయ్య, మురళి, లక్ష్మీనారాయణ శనివారం మానవపాడు స్టేజివద్ద లారీని అడ్డుకున్నారు. మానవపాడు స్టేజి వద్ద లారీని నిలుపకుండా అతివేగంగా ముందుకు వెళ్లగా జల్లాపురం స్టేజి సమీపంలో లారీని పట్టుకున్నారు. ఆవులను చూస్తుండగా డ్రైవర్ పారిపోగా ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని గోవులు తరలుతున్న లారీని పరిశీలించారు. పశువైద్య అధికారుల సమక్షంలో ఉండవల్లి మండల కేంద్రంలోని అయ్యప్ప గోశాలలో 19 ఆవులు, మూడు దూడలు వదిలి, కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తిప్పన్న తెలిపారు.

జన జాతర

- కురుమూర్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- జోగులాంబ ఆలయంలో కార్తీక శోభ
- అభయుడి సన్నిధిలో అభిషేకాలు

కార్తీక మాసం చివరి శనివారం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రద్దీ ఎక్కువ కావడంతో దర్శనానికి బారులుతీరారు. కురుమూర్తిస్వామి ఆలయంతో పాటు, జోగులాంబ ఆలయం, ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కురుమూర్తిస్వామి ఆలయానికి వెళ్లే దారిలో భక్తుల రద్దీ

చిన్నచింతకుంట/అలంపూరు/ఊర్కొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో గల కురుమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం కావటంతో భక్తులు పోటెత్తారు. దాంతో భక్తుల గోవింద నామస్మరణతో కురుమూర్తిగిరులు పులకించిపోయాయి. కాగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిసినా, జాతర ఇంకా కొనసాగుతున్నది. జాతర మైదానం అంతా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి స్వామి వారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున క్యూలైన్‌లో వేచి ఉన్నారు. జాతర మైదానంలోనూ జనంతో సందడి సందడిగా మారింది. ఆదివారం అమావాస్య కావటంతో భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.



కురుమూర్తిస్వామి ఆలయం వద్ద భక్తుల పూజలు



హాస్యనటుడు రాజేంద్రప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న ఈవో, అర్చకులు

అలాగే, అలంపూరు బాలబ్రహ్మేశ్వర స్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముందుగా పవిత్ర తుంగభద్రా నది పుష్కరఘాట్‌లో స్నామాచరించి నదిలో దీపాలను వదిలి, స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శ దర్శనం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు చేశారు. మహిళలు అమ్మవారికి చీరలు, గాజులు, వడిబియ్యం, త్రిశతి ఖడ్గమాలలను మొక్కుబడులుగా చెల్లించారు. మహిళలు ఉభయ ఆలయాల ముందు భాగంలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

దర్శించుకున్న ప్రముఖులు..

కార్తీకమాసం సందర్భంగా శనివారం ప్రముఖ హాస్య నటుడు రాజేంద్రప్రసాద్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు.

స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాతో సత్కరించారు.

అడుగంటిన తుంగభద్ర నది..

అలంపూరు పుణ్యక్షేత్రం తుంగభద్రనది జోగుళాంబ పుష్కర్‌ఘాట్ దగ్గర శనివారం దాదాపు ఐదు మెట్లు నీటి మట్టం తగ్గడం వల్ల భక్తుల పుణ్యస్నానాలకు ఇబ్బందిగా మారింది. నీళ్ల తగ్గే కొద్ది నీటిలో ఉన్న చెత్త చెదారంతో బయటికి వస్తుండటంతో నదిలో దీపాలు వదలడానికి ఇబ్బందిగా మారింది. దేవస్థానం వారు పరిశుభ్రంగా ఉంచుతున్నా నదిలో నీళ్ల తగ్గడం వల్లే ఇబ్బందిగా మారిందని దేవస్థానం ఈవో పురేందర్ కుమార్ తెలిపారు.

అదేవిధంగా, నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట అభయాంజనేయస్వామి వారి ఆలయం శనివారం కార్తీక శోభ సంతరించుకుంది. కార్తీక మాసం చివరి శనివారం కావడంతో పరిసర ప్రాంతాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచిభక్తులు తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయం పరిసరాలు కిక్కిరెసి జై హనుమాన్ నామస్మరణతో మారుమో గాయి. అంతకుముందు స్వామివారికి తెల్లవారుజామున అర్చకులు అష్టోత్తరములు, అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులు రద్దీతో దర్శనం కోసం గంటల కొలది క్యూలైన్‌లో నిలువాల్సి వచ్చింది. స్వామివారికి భక్తులు మొ క్కులు చెల్లించుకున్న అనంతరం సామూహిక వ్రతాలు నిర్వహించి అన్నదానం చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకున్నారు.



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి వారి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆలయ అభివృద్ధికి రూ. 25 లక్షల విరాళం



ఆలయ అధ్యక్షుడికి విరాళం అందజేస్తున్న రెడ్డి సేవా సంఘం నాయకులు

అచ్చంపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమామహేశ్వర క్షేత్రం అభివృద్ధి కోసం అచ్చంపేట రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో రూ25 లక్షల విరాళం ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈవో శ్రీనివాసులుకు శనివారం అందజేశారు. రెడ్డిసేవా సంఘం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సంఘం నాయకులు గోవర్దన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి, జైపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రారెడ్డిలు ఆలయంలో ఉమామహేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. బోగమహేశ్వరంలో నూతనంగా నిర్మిస్తున్న పంచలింగాల ఆలయ గోపురం నిర్మాణం కోసం ఖర్చు చేసేందుకు విరాళం అందించినట్లు రెడ్డిసేవా సంఘం అధ్యక్షుడు రామకృష్ణ రెడ్డి తెలిపారు. రెడ్డిసేవా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'సమూహ' రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న రాష్ట్ర బాధ్యులు


పాలమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'సమూహ' రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర బాధ్యులు కాత్యాయని విద్మహే, మెట్టు రవీందర్, సుంకిరెడ్డి నారాయణరెడ్డిలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ ఫోరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభలను డిసెంబరు 14వ తేదీన మహబూబ్‌నగర్ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర మహాసభల్లో రాజ్యాంగ విలువలను కాపాడే అన్ని సంస్థలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. మహాసభలను విజయవంతం చేయటానికి కవిసమ్మేళనాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సభ్యులు ఉదయమిత్ర, గుడిపల్లి నిరంజన్, ఆహ్వాన కమిటీ సభ్యులు ఎం.రాఘవాచారి, ఎస్.జగపతిరావు, కె.లక్ష్మణ్‌గౌడ్, ఖలీల్, వామన్‌కుమార్, ఉదయ్, సుభాష్, సతీష్, సృజన, ఖలీల్, అజీజ్, శ్రీశైలం, రెహమాన్, జనార్దన్ పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

జడ్చర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని కుర్వగడ్డపల్లి పరషవేదీ శ్వరస్వామి ఆలయంలో శనివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి పురస్కరించుకుని స్వామి వారికి రుద్రాభిషేకం అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, చంద్రకళ, సతీష్‌కుమార్, శారద, కైలాష్‌ఝావర్, యాదయ్య, పర్వతాలు, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అంజమ్మ పాల్గొన్నారు.

శ్రీరాముడు నడయాడిన శ్రీరామకొండ

- నేటి అమావాస్య ప్రత్యేకత - వేలాదిగా రానున్న భక్తులు



శ్రీరామకొండ ఆలయం

కోయిలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): త్రేతాయుగంలో శ్రీరాముడు లక్ష్మణ స్వామితో సందర్శించిన కొండగా శ్రీరామకొండ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రఖ్యాతి పొందిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతుంది. శ్రీరామకొండపై ఆదివారం అమావాస్య పర్వదినం ప్రత్యేకత ఉంది. ఈ రోజు స్వామిని దర్శించుకొంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తులు వేలాదిగా శ్రీరామకొండను దర్శించుకుంటారు.

శ్రీరామకొండకు త్రేతాయుగం నాటి కాలంలో స్వామి కొండలోని పెద్ద బండరాయిపై శ్రీరాముల వారు సేదతీరిన చోట స్వామి కుడిపాదం స్వయంభూవుగా వెలసింది. ఆ నాటి నుంచి నేటి వరకు స్వయంభూ రామ పాదానికి భక్తులు దర్శించుకొని పూజిస్తున్నారు. దీంతో పాటు శ్రీరామకొండపై అంజనేయస్వామి అమృత సంజీవిని మూలిక పెట్టారని, సంజీవిని మూలికతో కొండపై ఉన్న చెట్లు, కోనేరు నీరు మహిమాన్వితంగా మారడంతో శ్రీరామకొండకు వచ్చే భక్తులు తమ వెంట మూలికలు, కోనేటి నీటిని తమ వెంట తీసెకెళ్తారు. ఆదివారం అమావాస్యకు వచ్చే భక్తులకు పంచాయతీ ఆధ్వర్యంలో తాగు నీటి సౌకర్యం కల్పించారు. ఆదివారం అమావాస్య సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు.

ఇంటర్వ్యూ..



ధరణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం

» తహసీల్దార్ రాజా గణేష్

కోయిలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ధరణి దరఖాస్తులు సత్వరంగా పరిష్కారం చేయుటకు చర్యలు తీసుకొంటున్నామని తహసీల్దార్ రాజా గణేష్ వెల్లడించారు. మండలంలో భూ సమస్యలపై శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

మండలంలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి?

15వరకు ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎప్పటికప్పుడు విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారా?

కుటుంబ భూ తగాదాల దరఖాస్తులు వచ్చినప్పుడు ఆర్‌ఐలతో పాటు నేను కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. కోర్టు పరిధిలో ఉన్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎన్ని రోజుల ముందు స్లాట్ బుక్ చేసుకోవాలి?

భూ రిజిస్ట్రేషన్ కోసం ఒక రోజు ముందు మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలి. ఒక్కసారి స్లాట్ బుక్ చేస్తే ఐదు నెలల లోపు వర్తిస్తుంది.

మధ్య వర్తుల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

భూ సమస్య కానీ, ఇతర ఏ విషయంలో అయినా మధ్య వర్తులను నమ్మొద్దు. నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకుంటే వెంటనే సమస్య పరిష్కరిస్తాం.

న్యూస్ బాక్స్

హామీలు అమలు చేయాలి

మిడ్జిల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ శనివారం తెలిపారు. వరుసగా నాలుగు రోజుల పాటు పార్టీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో డిసెంబరు 2న చార్జిషీట్ విడుదల, 4న బైక్ ర్యాలీలు నిర్వహించి, నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించే బహిరంగ సభకు వెళ్లడం జరుగుతుందన్నారు.

జోరుగా ధాన్యం విక్రయాలు

దేవరకద్ర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ధాన్యం క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. ఆర్ఎన్ఆర్ 467 క్వింటాళ్లు రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.2,709, కనిష్ఠంగా రూ.2,243 పలుకగా, హంస 114 క్వింటాళ్లు రాగా, గరిష్ఠంగా రూ.1,939, కనిష్ఠంగా రూ.1,938 పలికింది. ఉల్లిగడ్డ 38 క్వింటాలు వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గండీడ్ , నవంబరు 30 (ఆంధ్రజ్యోతి : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టుబడిన సంఘటన మండలంలోని రంగారెడ్డిపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. శనివారం తెల్లవారుజామున రంగారెడ్డిపల్లి వాగు నుంచి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గోరక్ష జిల్లా ప్రముఖ్‌గా సందీప్‌నాయుడు

చిన్నచింతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కురుమూర్తి గ్రామానికి చెందిన సందీప్‌నాయుడుకు బజరంగ్ దళ్ గోరక్ష జిల్లా ప్రముఖ్‌గా ఎన్నికయ్యారు. ఈ నెల 29, 30 తేదీల్లో జిల్లా కేంద్రంలో జరిగిన బజరంగ్‌దళ్ నివాసి వర్గలో భాగంగా శనివారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ప్రాంత అధికారుల ముగింపు కార్యక్రమంలో వీహెచ్‌పీ భాగ్యనగర క్షేత్ర కార్యదర్శి సత్యంజీ సందీప్‌నాయుడును ఎన్నుకున్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రవక్త మార్గం అనుసరణీయం అని డాక్టర్ ముఫ్తి జియావుద్దీన్ అన్నారు. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ యూనివర్సిటీ జామియ నిజామియా ఫౌండర్ హజ్రత్ మహ్మద్ అన్వారుల్లా ఫారుఖి రహమతుల్లా అలై 110వ ఉర్సును పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జామియ మసీద్‌లో శనివారం నిర్వహించిన ధార్మిక సభలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో జామియ మసీదు ఇమామ్ హాఫీజ్ ఇస్మాయిల్, మౌలానా ఖాజా ఫైజోద్దీన్, మౌలానా మొహసిన్‌పాషఖాద్రీ, మౌలానా మునీరుద్దీన్, ఇలియాజ్, ఇంతియాజుర్ రహెమాన్, వారిస్‌పాషా పాల్గొన్నారు.

నేడు తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.డీ. ఖాజామైనోద్దీన్, కొప్పోలు యాదయ్య, ప్రచార కార్యదర్శి ఆర్ ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూటౌన్‌లోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు తెలంగాణ సాహితీ ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. నివేదికల అనంతరం కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. అతిథులుగా తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన, ఉపాధ్యక్షుడు మోహన్‌కృష్ణ, వాగ్దేవి జూనియర్ కళాశాల డైరెక్టర్ విజేత వెంకటరెడ్డి హాజరవుతారని, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, రచయితలు, పాల్గొని కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆకు కూరల్లేవ్

» ధరలు ఎక్కువ ఉన్నందుకు బంద్

» నాణ్యత లేని కూరగాయలతో విద్యార్థులకు భోజనం



కోయిలకొండ బీసీ గురుకుల పాఠశాల



కేజీబీవీలో నాణ్యత లేని కూరగాయలు

కోయిలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాల, బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాణ్యతలేని కూరగాయలతో భోజనం అందిస్తున్నారు. దీంతోపాటు ఆకు కూరలు పెట్టడం లేదని పలువులు విద్యార్థులు వాపోతున్నారు. కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో 327 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి అందించే కూరగాయలను పరిశీలించిగా అందులో ఆకు కూరలు లేకపోగా నాణ్యత లేని టమాటాలు ఉన్నాయి. అదే విధంగా మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. 270 మంది విద్యార్థులు ఉండగా, అక్కడ కూడా విద్యార్థులకు ఆకు కూరలు పెట్టడం లేదు. దీనికి తోడు నాణ్యత లేని ఉల్లిపాయలు వాడుతున్నారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలో కూరగాయలు టెండర్లు తీసుకొన్న వారు ఆకుకూరల ధరలు ఎక్కువగా ఉన్నందున పుంటికూరతో పాటు అప్పుడప్పుడు పాలకూర తీసుకొస్తున్నారని విద్యార్థులు తెలిపారు. దీంతో చాలా మంది విద్యార్థులు రక్తహీనతో ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ప్రభుత్వం ఆకుకూరలకు కేజీకి రూ.18 అందించనుండగా, మార్కెట్‌లో ఆకు కూరలు కేజీ రూ.120 పైగా ఉండటంతో టెండర్లు తీసుకొన్న వారు ఆకు కూరలు తీసుకవరావడం లేదని హాస్టల్ అధికారులు చెబుతున్నారు. తనిఖీ చేయడానికి వచ్చిన అధికారులు నామమాత్రంగా తనిఖీ నిర్వహించి, ఫొటోలు దిగుతున్నారు తప్ప.. పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతలేని కూరగాయలు వెనక్కి పంపిస్తున్నాం..

కస్తూర్బా గాంధీ పాఠశాలకు నాణ్యత లేని కూరగాయలు తీసుకొస్తే వెనక్కి పంపిస్తున్నాం. పుంటికూర, పాలకూర పెడుతున్నాం. విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలతో భోజనం అందించేందుకు చర్యలు తీసుకున్నాం

\- హారిక, ఎస్‌వో

ఆకు కూరలు పెడుతున్నాం..

మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో వారానికి మూడు సార్లు ఆకు కూరలతో విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. కాంట్రాక్టర్లు ఆకు కూరల ధర ఎక్కువగా ఉంటే తీసుకరావడం లేదు. కానీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందింస్తున్నాం.

\- శ్రీకాంత్, బీసీ గురుకుల ప్రిన్సిపాల్

కష్టాలు అనుభవిస్తేనే.. సుఖం విలువ తెలుస్తుంది

» ప్రముఖ ప్రవచన కర్త పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు



గరికపాటి దంపతులను సన్మానిస్తున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

మమబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మనిషి తన జీవితకాలంలో కష్టాలు అనుభవించినప్పుడే సుఖం విలువ తెలుస్తుందని ప్రముఖ ధార్మిక ప్రవచన కర్త పద్మశ్రీ అవార్డు గ్రహీత గరికపాటి నరసింహారావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలోని అన్నపూర్ణ గార్డెన్‌లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక మాసం, విశిష్టత, హిందూ సంస్కృతి సాంప్రదాయాలపై నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనం చేశారు. దైవం సమాజ రూపంలో ఉంటుందన్నారు. ప్రతీ ఒక్కరు సమాజ సేవ చేస్తే దైవసేవ చేసినట్లేనన్నారు. కార్తీక మాసంలో పూజలు నిర్వహించడంతో దైవ కృపతో పాటు శారీరక రుగ్మతల నుంచి కూడా మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. సాధారణంగా ప్రతీ ఒక్కరు ఈ మాసంలో వేడినీటితో స్నానం చేస్తారన్నారు. అది సహజ లక్షణం అన్నారు. కాని అయ్యప్ప మాలలు ధరించిన భక్తులు ఉదయం తెల్లవారు జామున ఎంత చలివేసిన స్వామియో శరణం అయ్యప్ప అంటు చల్లని నీటితో స్నానం చేస్తారన్నారు. దీనికి కారణం వారు దీక్షలో ఉండడం అన్నారు. ప్రతీ ఒక్కరు పూజలు, దీక్షల్లోని సారాంశాలను గ్రహించాలన్నారు. దీక్షలతో మనలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. దీపం వెలిగించడం అంటే మనలో మనం జ్ఞానాన్ని వెలిగించుకోవడం లాంటిదన్నారు. దీపారాధనకు అంతటి విశిష్టత ఉందన్నారు. కార్తీక మాసంలో ఒక రోజైన ప్రతీ ఒక్కరు వనభోజనాలకు వెళ్లాలన్నారు. వన భోజనాలను శ్రీ కృష్ణుడి కాలం నుంచి ఆచారంగా వస్తుందన్నారు. వన భోజనాలతో మనలో సమైక్యత పెరుగుతుందన్నారు. హిందువులందరూ సంఘటింగా ఉండాలని పిలుపునిచ్చారు. హైందవ ధర్మంలో పెద్దలను గౌరవవించడం అంటే దైవాన్ని పూజించడంతో సమానమన్నారు. అనంతరం గరికపాటి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ, బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వానికి అపూర్వ స్పందన

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వానికి అపూర్వ స్పందన వస్తోందని ఆ పార్టీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ పట్టణంలోని 11,12,13,27 వార్డుల్లో సభ్యత నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ప్రతీ కార్యకర్త రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.ఐదు లక్షల వరకు ఇన్సూరెన్స్ సదుపాయం ఉంటుందన్నారు. నాయకులు చెన్నయ్య ముదిరాజ్, శ్రీనివాసులు, కోణాల్, మేస్త్రీ శ్రీనివాసులు, బాబురెడ్డి, మాధవరెడ్డి, లక్ష్మమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



మహబూబ్‌నగర్ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సభకు తరలివచ్చిన కార్యకర్తలు



కోయిలకొండ నుంచి సభకు తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్ / కోయిలకొండ/ రాజాపూర్/మిడ్జిల్/హన్వాడ/మూసాపేట/ దేవరకద్ర/కౌకుంట్ల/చిన్నచింతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి సమీపంలోని అమిస్తాపూర్ వద్ద శనివారం నిర్వహించిన రైతు పండగ ముగింపు బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి రావడంతో మమబూబ్‌నగర్ మునిసిపల్ పరిధిలోని పలు వార్డుల నుంచి మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కోయిలకొండ మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రవీందర్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. అదే విధంగా రాజాపూర్ మండల కేంద్రంతో పాటు ముదిరెడ్డిపల్లి, ఇద్గాన్‌పల్లి, రంగారెడ్డిగూడ, కల్లేపల్లి, తిరుమలాపూర్, కుచ్చర్‌కల్, చెన్నవెల్లి గ్రామాల నుంచి కాంగ్రెస్ మండల నాయకుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో తరలివెళ్లారు. మిడ్జిల్ మండలంలోని పలు గ్రామాల నుంచి బాదేపల్లి మార్కెట్ చైర్మన్ తంగెళ్ల జ్యోతి అల్వాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తరలి వెళ్లారు. హన్వాడ మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లగా, మూసాపేట మండలం నుంచి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్‌గౌడ్‌తో పాటు మండల నాయకులు తరలివెళ్లారు. దేవరకద్ర, కౌకుంట్ల, చిన్నచింతకుంట బాలానగర్ మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భారీగా తరలివెళ్లారు.

విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు

» ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



జడ్చర్లలో ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జడ్చర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థలలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్‌కు నిరసనగా శనివారం జడ్చర్లలో ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి వస్తున్నారని, సరైన భోజనం అందక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలకు, గురుకులాలకు, కేజీబీవీలకు సన్న బియ్యం ఇస్తున్నామని ప్రకటనలకే పరిమితం అయ్యారని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, కార్తీక్, బన్ని, నరేశ్, సురేశ్ పాల్గొన్నారు.

● గండీడ్ : ప్రభుత్వ విద్యాసంస్థల్లో జరిగిన ఫుడ్ పాయిజన్‌కు నిరసనగా శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ చేయించారు. యూనియన్ మండల కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదని విమర్శించారు. గురుకులాలు, కస్తూర్బా హస్టళ్లు, మధ్యాహ్న భోజనం అందించడంలో విఫలమైందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు.

● బాలానగర్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసిన కూడా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ అయి అనారోగ్య పాలవుతున్నారని అన్నారు. కనీసం విద్యార్థులకు నాణ్యమైన భోజనం కూడా అందించని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. నాయకులు చంటి, హమీద్, ఆనంద్, వెంకీ, కృష్ణ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ముందస్తు అరెస్టు

జడ్చర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో జరిగే రైతు సదస్సు బహిరంగ సభకు ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జడ్చర్లలో శనివారం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం, సోషల్ మీడియా విభాగం నాయకులను జడ్చర్ల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. బీఆర్ఎస్వీ, సోషల్ మీడియా నాయకులు మనోహర్‌రెడ్డి, సోహైల్, మహమూద్, సాయినాథ్‌రెడ్డిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

● మిడ్జిల్ : హామీలు నెరవేర్చకుండా ప్రజలను, రైతులను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండగలను నిర్వహిస్తోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. శనివారం ముఖ్యమంత్రి సభ సందర్భంగా బీజేవైఎం నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లడారు. ఇందిరమ్మ రాజ్యమంటే ప్రజలు నమ్మి ఓట్లు వేశారని, ఇందిరమ్మ రాజ్యమంటే ప్రశ్నించే గొంతులను అణిచివేయడమని ప్రజలకు ఇప్పుడిప్పుడు అర్థమవుతుందన్నారు. ప్రశ్నిస్తున్న వారిని పోలీసులతో అరెస్టుల చేయించి కేసులు పెడితే భయపడేవారురెవరు లేరని, రైతులు, ప్రజలకు ఇచ్చిన హమిలన్ని నేరవేర్చేంత వరకు పోరాటాలు చేస్తునే ఉంటామని తిరుపతి తెలిపారు. అరెస్టు అయిన వారిలో నాయకులు బండి భాస్కర్, రమేష్‌గౌడ్, యాదయ్య, నవీన్, చంద్రశేఖర్, శ్రీకాంత్, రాము, నరేష్, అజయ్ ఉన్నారు.

ఘనంగా కార్తీక పూజలు

భూత్పూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ముగింపు సందర్భంగా శనివారం స్థానిక రామలింగేశ్వర స్వామి ఆలయంలో విశ్వహిందూ మాతృ మండలి మహిళలు ఘనంగా మాస శివరాత్రి పురస్కరించుకొని ఉమామహేశ్వర స్వాముల వ్రతాన్ని చేపట్టారు. అదే విధంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మురళిధర్ గౌడ్ భక్తులకు అన్నదానం చేశారు. అంతకు ముందు ఆలయంలో ఆంజనేయస్వామి భజన మండలి భక్తులు భజన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, ముత్త శ్రీశైలం, అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సురేష్ కుమార్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ మాతృమండలి మహిళలు పాల్గొన్నారు.

టచ్ ఆర్గనైజేషన్‌ను సందర్శించిన విద్యార్థులు



టచ్ ఆర్గనైజేషన్ వారితో పాలమూరు యూనివర్సిటీ విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగం మొదటి సంవత్సరం విద్యార్థులు శనివారం టచ్ ఆర్గనైజేషన్‌ను సందర్శించారు. కోర్సులో భాగంగా ఆయా కార్యక్రమాలపైన అవగాహన పెంచుకునే విధంగా వివిధ స్వచ్ఛంద సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా టచ్ సంస్థ డైరెక్టర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మహిళలు పరిశుభ్రతపైన కీలక పాత్ర పోషించాలన్నారు. సంస్థలను ఏ విధంగా నెలకోల్పుకోవాలనే అంశంపై విద్యార్థులరు అవగాహన కల్పించారు. విభాగధిపతి డాక్టర్ బండి పర్వతాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీయూలో సమస్యలు పరిష్కరించాలి



సమస్యలకు సంబంధించిన పత్రాన్ని చూపుతున్న ఎస్ఎస్‌యూఐ నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పీయూ సమస్యలకు సంబంధించిన పత్రాలను మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా పీయూ ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వంశీకుమార్ మాట్లాడుతూ.. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఖర్చుల భారం పెరిగిందని, విద్యార్థులకు సహకారం అందించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచింది. కానీ యూనివర్సిటీ హాస్టళ్లలో మాత్రం అందుకు భిన్నంగా విద్యార్థులపై అధిక భారం పడేలా యూనివర్సిటీ ఉద్యోగులు పనిచేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు తీసుకొని వచ్చే సామగ్రిని తమ అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీ హాస్టళ్లలో పనిచేసే ఓ వర్కర్‌ను అదే హాస్టల్ పనిచేసే కొందరుపై స్థాయి ఉద్యోగులు తమ సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని, అలా చేయకపోతే నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. తాము చెప్పినట్లు వింటే హాస్టల్ వ ర్కర్లు రాకపోయినా హాజరు వేస్తున్నారని ఆరో పించారు. చాలా కాలంగా ఒకే సెక్షన్‌లో పని చేస్తూ అవినీతికి, అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగులను స్థానచలనం చేయాలని, యూనివర్సిటీలోని సమస్యలు పరిష్కరించాలన్నారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు పీడీ దామోదర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డిసెంబరు 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ మహిళ కబడ్డీ టోర్నీలో పాల్గొనే మహబూనగర్ జిల్లా మహిళ జట్టుకు శనివారం స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన హాజరై ప్రారంభించి, మాట్లాడారు. శిక్షణ శిబిరంలో ప్రతిభ చాటి తుది జట్టుకు ఎంపికావాలన్నారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. ఈనెల 6వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహించి, తుది జట్టును ఎంపిక చేస్తామని జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ తెలిపారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలు బాల్‌రాజ్, పాపరాయుడు, పీడీలు శ్రీనివాసులు, మేరీ పుష్ప, రజిని, శివాణి, ఈసీ సభ్యులు గణేష్, లతీఫ్ పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సహకార సంఘం ఉద్యోగులు

భూత్పూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సహకార సంఘం ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఐఆర్ బెసిక్ ఐదు శాతం పెంచుతున్నట్లుగా శనివారం ప్రకటించడంతో స్థానిక సహకార సంఘం ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనతరం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రత్నం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సహకార సంఘంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులను ఎవరు పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వారి కష్టాలను గుర్తించి ఐఆర్ ఐదు శాతం పెంచి ఆదుకుందన్నారు. సహకార సంఘం ఉద్యోగులు యాదగిరి, భాస్కర్‌గౌడ్, కిషోర్‌రెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

శిశు మందిరాల్లోనే నైతిక విద్య

జడ్చర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలతో కూడిన విద్య సరస్వతి శిశుమందిరాలు అందిస్తున్నాయని సరస్వతి విద్యాపీఠం పాలమూరు ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి అన్నారు. జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియంలో శనివారం జరిగిన సరస్వతి విద్యాపీఠం జిల్లాస్థాయి ఖేల్‌కూద్ పోటీలకు ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు అథ్లెటిక్స్ కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగాసన్, హకీ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్ సతీష్, రంగ రాములు, ఈశ్వర్, హెచ్‌ఎం వెంకటయ్య, కృష్ణ, మోహన్, రాధాకృష్ణ, నోముల కృష్ణయ్య పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

జడ్చర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించడం పరిపాటిగా మారింది. శనివారం సాయంత్రం దాదాపు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. తాజాగా రోడ్డు మధ్యలో లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించి పోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. సిగ్నల్‌గడ్డ ప్రాంతంలోని అంబేడ్కర్ చౌరస్తా, నెహ్రూ చౌరస్తాలో సుమారు కిలో మీటరు మేర వాహనాల నిలిచిపోయాయి. జడ్చర్ల పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించడంతో రాకపోకలు యధావిధిగా సాగాయి.



జడ్చర్ల పట్టణంలో స్తంభించిన ట్రాఫిక్

కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయం చేయాలి

పాలమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయం చేయాలని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.యం ఖలీల్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 14ఏళ్ల నుంచి పోరాడి సాధించుకున్న ఇంటి పట్టా సర్టిఫికెట్లను 2018లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, అందులో 886 మందిని అర్హులుగా గుర్తించి, డబుల్ ఇళ్లు ఇవ్వకుండా బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, విజయ్‌కుమార్, యాదగిరి, స్వేపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, నాయకులు బాలకృష్ణ, జైపాల్, మమత, లక్ష్మి, ఆయేషా, అరిఫ్ పాల్గొన్నారు.